

బొంకూరు పొలిమేర వద్ద ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

- కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు
- విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా
- ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు
- బిడ్డా.. మా ఓటు కారు గుర్తుకే.. హామీ ఇచ్చిన వృద్ధ మహిళలు
- గ్రామగ్రామానా సబ్బండ వర్గాల ఏకగ్రీవ తీర్మానం

ఉండవెల్లి, నవంబర్ 17 : బిడ్డా.. కారు గుర్తుకే మా ఓటు వేసి, వేయించి గెలిపించుకుంటామని వృద్ధమహిళలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడుకి హామీ ఇచ్చారు. మండలంలోని బొంకూరు, ఉండవెల్లి, మెన్నిపాడు, కలుగోట్ల గ్రామాల్లో విజయుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, విజయుడిని ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు గ్రామ పొలిమేరల వద్దకు చేరుకొని మేళతాళాలతో పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయుడు ప్రచార రథంపై వీధుల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆర్డీఎస్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్‌కు మల్లమ్మకుంట, ఒల్లూరు, జూలెకల్ గ్రామాల్లో రిజర్వాయర్లను నిర్మిస్తున్నట్లు వివరించారు. రైతులు సంబురంగా సాగుచేసినప్పుడే ఈ ప్రాంత ప్రజల జీవన విధానం మారుతుందన్నారు. అదేవిధంగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే నెలలోపే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల కోసం వచ్చే ప్రతిపక్ష పార్టీలను నమ్మి మోసపోవద్దని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా మార్చిన కారు గుర్తుకు ఓటు వేసి విజయుడిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్ఆర్ ఫౌండేషన్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, విజయమ్మ, పీఏసీసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

# బీఆర్ఎస్‌కే మా మద్దతు

- అలంపూర్ పట్టణ వాల్మీకుల తీర్మానం
- ఎమ్మెల్సీ చల్లాను కలిసి సంఘీభావం తెలిపిన నాయకులు



బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న వాల్మీకులు

అలంపూర్, నవంబర్ 17 : బోయల హక్కుల సాధనకు కృషి చేసి, వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సహకరించిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకే పట్టణ వాల్మీకుల మద్దతు ఉంటుందని తీర్మానం చేశారు. శుక్రవారం వాల్మీకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిసి తమ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో అలంపూర్ పట్టణ వాల్మీకి సంఘం అధ్యక్షుడు శేషన్న నాయుడు, ప్రధాన కార్యదర్శి సంజీవనాయుడు, ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయుడు, కార్యదర్శి బైరంపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# క్రమసంఖ్య ఆధారంగా పంపిణీ

- బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి
- ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ స్ట్రాంగ్‌రూంకు తరలింపు: కలెక్టర్ క్రాంతి
- రాజకీయ నాయకులు, అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ పరిశీలన

గద్వాల, నవంబర్ 17 : బ్యాలెట్ యూనిట్లపై అవగాహన కల్పిస్తూ అదనపు బీయూల ర్యాండమైజేషన్ పూర్తి చేసి క్రమసంఖ్య ఆధారంగా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థుల సమక్షంలో బీయూల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో 20మంది అభ్యర్థులు బరిలో ఉండగా రెండు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి బ్యాలెట్ యూనిట్లను మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇదివరకు ఉన్న 338 బ్యాలెట్ యూనిట్లకు బదులుగా 378 బ్యాలెట్ యూనిట్లు కేటాయించామని, వాటిని ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ స్ట్రాంగ్ రూంకు తరలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ యూనిట్ల ద్వారా ఓటు వినియోగంపై ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను ఓపెన్ చేయించి బ్యాలెట్ యూనిట్లను క్రమసంఖ్య ఆధారంగా చెక్ చేసి స్ట్రాంగ్ రూంకు తరలించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఎన్నికల సూపరింటెండెంట్ నరేశ్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే

- అధికారం సంగతి దేవుడెరుగు.. సీఎం సీటు కోసం తండ్లాట
- ఓట్లు అడిగే హక్కు మాకే ఉంది..
- సంక్షేమం, అభివృద్ధిలో బీఆర్ఎస్‌కు సాటిలేదు
- ఎవరిని ఆదరించాలో ప్రజలకు తెలుసు
- ఎన్ని జిమ్మిక్కులు చేసినా కారుదే గెలుపు
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



నృత్యాలు చేస్తూ ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

గట్టు, నవంబర్ 17 : కాంగ్రెస్‌ను నమ్మితే అదోగతేనని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని రాయపురం, ఆలూరు, బింగిదొడ్డి తండా, వాయిల్‌కుంటతండా, బస్సాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు చేస్తూ ఘనస్వాగతం పలకగా ఎమ్మెల్యే ప్రచార రథంపై నుంచి మాట్లాడారు. గత ఎన్నికల్లోనూ పలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మలేదన్నారు. ఇప్పుడు కూడా వారికి అదే పరిస్థితి తప్పదని ఎద్దేవా చేశారు. అధికారం రావడం దేవుడెరుగు.. హస్తం పార్టీలో అప్పుడే సీఎం కుర్చీ కోసం తండ్లాట మొదలైందని విమర్శించారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని సంక్షేమం, అభివృద్ధి తెలంగాణలో ఉందన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతున్నదని, గత ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. రైతుబంధు, రైతుబీమాతో అన్నదాతను అన్నివిధాలా ఆదుకుంటున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టంచేశారు. ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. ఇన్నాళ్లూ కన్నెత్తి చూడని కాంగ్రెస్, బీజేపీ నాయకులు నేడు అధికారం కోసం తాపత్రపడుతూ ప్రజల్లోకి వస్తున్నారని, వారిని గమనించాలని సూచించారు. ఎవరికి ఓటు వేయాలనే విషయంలో ప్రజలకు స్పష్టత ఉందని, ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రయోజనం లేదన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, జెడ్పీటీసీ శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచ్ హనుమంతు, నర్సన్‌గౌడ్, నాయకులు అంగడి బస్వరాజు, ఆలూరు రాము, గద్వాల తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలు మారే వారిని తరమికొట్టండి

మల్దకల్, నవంబర్ 17 : పదవుల కోసం పార్టీలు మారే వారిని తరిమికొట్టాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మల్దకల్ సంత బజారులో ఎంపీపీ రాజారెడ్డి అధ్యక్షతన మండల మహిళా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే ముందు వరుసలో ఉన్నదన్నారు. సంక్షేమ పథకాల వల్ల బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతున్నదన్నారు. అధికార దాహంతో కల్లబొల్లి మాటలు చెప్పే వారిని నమ్మొద్దని సూచించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరోసారి కారుగుర్తుకు ఓటు వేసి తన భర్తను ఆదరించాలని కోరారు. ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని కోరుతూ దొంగలు వస్తారని, వారిని నమ్మొద్దని రాష్ట్ర కన్జ్యూమర్ ఫోరం అధ్యక్షుడు గట్టు తిమ్మప్ప అన్నారు. బీకేఎంఆర్‌కు 50వేల మెజార్టీ తీసుకురావాలని కోరారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, పద్మ, బాసు శ్యామల, నాయకులు కుర్వ విజయ్‌కుమార్, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, సభకు మల్దకల్, గట్టు మండలాలకు చెందిన మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఆశీర్వాద సభలో పాల్గొన్న గట్టు, మల్దకల్ మండలాల మహిళలు



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చిత్రంలో బండ్ల జ్యోతి, గట్టు తిమ్మప్ప